

జిల్లాలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు

కామారెడ్డి టౌన్, మే 31: జిల్లాలో ఎండవేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత వారం రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు ఇండ్లలోంచి రావాలంటే జంకుతున్నారు. శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. కోల్లూర్‌లో 44.8, బిచ్కుంద 43.9, బీర్కూర్, డోంగ్లి 43.8, రామారెడ్డి 43.3, హసన్‌పల్లి 43.1, నస్రూల్లాబాద్ 42.9, ఎల్పుగొండ 42.8, జుక్కల్, గాంధారి 42.7, పిట్లం 42.6, పాతరాజంపేట, భిక్కనూరు 42.3, బోమన్ దేవాయిపల్లి 42.1, సోమూర్, సదాశివనగర్, ముక్తుంపూర్, దోమకొండ 42.0, తాడ్వాయి 41.9, మాచాపూర్ 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



బదిలీలకు ప్రయత్నాలు

- కోడ్ ముగిశాక అధికారులకు స్థాన చలనం
- కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు
- నచ్చిన చోట పోస్టింగ్‌ల కోసం పైరవీలు



కామారెడ్డి, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అధికారుల బదిలీ జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికలు పూర్తి కావడం, రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు సిద్ధంగా ఉండడంతో అధికారుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడనున్నాయి. 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. ఆ తర్వాత ఒక్కో శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ మొదలు కానుంది. ఈ క్రమంలో జిల్లాలో అన్ని శాఖల పరిధిలో కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పని చేస్తున్న అధికారులకు స్థానచలనం తప్పనిసరిగా మారనుంది. సొంత జిల్లాలు, కుటుంబాలకు దూరంగా ఉంటూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులంతా బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాము కోరు కున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అంతేకాక ఎన్నికల బదిలీలు సొంత జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వారంతా తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారంతా దాదాపు బదిలీలపై వచ్చినవారే ఉన్నా రు. ఈ క్రమంలో పాలన సజావుగా సాగాలంటే దూర ప్రాంతాల వారిని తిరిగి కోరుకున్న చోటుకు పంపేందుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు సైతం కోరుతు న్నాయి.

మండల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు

ఎన్నికల బదిలీల్లో సొంత జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు తిరిగి జిల్లాకు వచ్చేందుకు అవకాశాలను ఆలోచిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించిన వివిధ శాఖల మండలస్థాయి అధికారుల నుంచి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు ఎన్నికల బదిలీల్లో భాగంగానే వచ్చినవారు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో తమ సొంత స్థలానికి బదిలీ చేయాలని కోరుతున్నారు. పోలీసు, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, అటవీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, విద్య, ఇంజనీరింగ్ తదితరశాఖల్లో పని చేస్తున్న అధికారులు తమకు అనుకూలంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

పోస్టింగ్ కోసం పైరవీలు

పోలీసుశాఖలో పని చేస్తున్న ఎస్‌ఐ, సీఐ, డీఎస్‌పీల కోసం ఎన్నికల సమయంలో చాలా మంది బదిలీపై వచ్చారు. అదేసమయంలో జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లారు. వారంతా మళ్లీ జిల్లాకు వచ్చేందుకు తమ పలుకుబడిని వినియోగిస్తున్నారు. ఇప్పటికే కొందరు పోలీసు అధికారులు రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారు, తమ బంధువులు, తెలిసిన వారితో పోస్టింగ్‌ల కోసం పైరవీలు మొదలుపెట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యేల సిఫారస్ లేఖలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొందరికి పోస్టింగ్‌లు దక్కాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌లో అదే సిఫారస్‌ల పద్ధతి కొనసాగుతుండడంతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పోలీస్‌శాఖతో పాటు యూనిఫాం సర్వీస్‌లైన, ఎక్సైజ్, ఆర్‌టీఏ, అటవీశాఖ అధికారులు సైతం మంచి పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

రెవెన్యూలో ఎక్కువగా బదిలీలు అయ్యే అవకాశం

ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన రెవెన్యూ శాఖలో ఎక్కువగా బదిలీలు సాగే అవకాశం ఉంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్, డీటీ అధికారులకు స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. జిల్లా పరిధిలోనే పలు మండలాల్లో ఇంటికి దూరంగా పని చేస్తున్న అధికారులు తమ స్థానాల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. పైరవీల ప్రభావంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ దక్కుతుందోనని కొందరు టెన్షన్ పడుతున్నారు. మారుమూల మండలాలతో పాటు ఇతర జిల్లాలకు కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్ల ఇంచార్జ్‌లుగా, ఆర్‌డీవో, ఆఫీస్ సూపరింటెండెంట్ బదిలీలు చేస్తారనే గుబులుతో ఉన్నారు. కొందరు కలెక్టరేట్‌లో కీలకశాఖలో కొన్ని ఏళ్లుగా తిష్టవేశారు. పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా సీట్లు మాత్రం వదలడం లేదు. కొందరు ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని కోరుకున్న చోట కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి అధికారులకు బదిలీలు ఉండాలని తోటి ఉద్యోగులే డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పరిధితో పాటు జోన్, మల్టీజోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు అనుకూలమైన చోట పోస్టింగ్ కోసం పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వస్తుందోనని అధికార వర్గాల్లో చర్చసాగుతోంది.





కంప్యూటర్ విద్యకు మంగళం!

- ప్రభుత్వ పాఠశాలలకు నిర్లక్ష్యపు జబ్బు
- చాలా పాఠశాలల్లో మూలన పడ్డ కంప్యూటర్లు
- విద్యార్థులకు అందని కంప్యూటర్ విజ్ఞానం
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థి సంఘాలు

కామారెడ్డి టౌన్, మే 31: ప్రస్తుతం అన్ని రంగాల్లో సాంకేతికత విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే శిక్షణ ఇస్తున్నారు. పదో తరగతి పూర్తిచేసేసరికి వారు కంప్యూటర్ విద్యలో నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. ఈ తరహా విద్యను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో అప్పటి ప్రభుత్వం 2008లో కంప్యూటర్ విద్యకు శ్రీకారం చుట్టింది. మొదట్లో పథకం బాగానే అమలైనప్పటికీ రానురాను నిర్వహణలో నిర్లక్ష్యం పెరిగింది. అటు ప్రభుత్వం, ఇటు విద్యాశాఖ పట్టించుకోకపోవడంతో మూడేళ్లలోనే పథకం కాస్తా అటకెక్కింది. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగానే మిగిలింది.

నిర్వహణ లేక నీరుగారి

కంప్యూటర్లను పంపిణీ చేసిన ప్రభుత్వం పాఠాలు బోధించే ఉపాధ్యాయులను నియమించడం మాత్రం మరిచిపోయింది. కంప్యూటర్లను పంపిణీ చేసిన ఏడాది తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి ఒత్తిడి రావడంతో మొదటగా కొన్నినెలలు కాంట్రాక్ట్ పద్ధతిన ట్రైనర్స్‌ను నియమించి పాఠాలు బోధించేలా చర్యలు తీసుకుంది. ఆ తర్వాత వారికి సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం, కంప్యూటర్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా పాఠశాలల్లో అవి మూలకు చేరాయి. పలు పాఠశాలల్లో కంప్యూటర్ తరగతుల నిర్వహణకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటి వరకు వాటిని సక్రమంగా ఉపయోగించింది లేదు.

ఈ ఏడాదైనా కొనసాగేనా?

వచ్చే నెల 13వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలల నిర్వహణ, కంప్యూటర్ విద్యతో పాటు పలు మార్పులు తీసుకురావాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. లేకపోతే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. ఈ దిశగా అధికారులు, పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతితో బీఆర్‌ఎస్ పార్టీ కంపుకొడుతుంది



వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనితను సన్మానిస్తున్న షబ్బీర్‌అలీ

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మే 31: అవినీతితో నిండిపోయి బీఆర్‌ఎస్ పార్టీ కంపుకొడుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉరుదొండ వనిత ఎన్నిక కావడంతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని దుర్వినియోగం చేస్తూ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి రహిత పాలన అందిస్తుందని, భూ కబ్జాలు, ఇంటి పర్మిషన్లకు లంచాలు లేకుండా అందరికీ ఒకేలా పాలన అందిస్తుందని అన్నారు. అదేవిధంగా ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్‌లు కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధాన్యం కొనుగోలు జరగడం లేదని విత్తనాలు లభించడం లేదని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో ఎప్పుడు లేని విధంగా ఒకనెల రోజుల ముందే మే 30లోపు 9 9 శాతం వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 94 శాతం మంది రైతులకు వారి అకౌంట్లో డబ్బులు కూడా వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ఇప్పటి వరకు 3,11,598 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. గతంలో జూన్ 15 వరకు రైతుల వద్ద నుంచి ప్యాడీ కొనుగోలు చేసేవారు కానీ ఈసారి మే 30 వరకు రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. జీలుగ, పెద్ద జనుము జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,800 బ్యాగులు అందించామని ఇంకా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో అనావృష్టి వల్ల అరుసార్లు పంటనష్టపోతే ఒక్కసారి కూడా నష్టపరిహారం అందించలేదని కనీసం వారిని పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు. వేల కోట్ల అవినీతితో మేడిగడ్డ కుంగిపోయిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ జైలుకు పోయే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. అకాల వర్షాలు, వడగాళ్లకు పంట నష్టపోయిన రైతులకు ఊహించిన రీతిలో కామారెడ్డి నియోజకవర్గంలో పది వేల ఎకరాలకు 9,500 మంది రైతులకు 100 కోట్ల నష్ట పరిహారం అందించి ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మార్చారని సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం జరిగిందని తెలం గాణ రాష్ట్ర గీతం మాత్రమే రూపొందించామని ఎలాంటి చిహ్నాలను మార్చలేదని అన్నా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి

ఎంపీపీ స్థానం బీఆర్‌ఎస్ కైవసం

ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన టేకులపల్లి వినీత

నాగిరెడ్డిపేట, మే 31: నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీ పదవి ఎట్టకేలకు బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇన్‌చార్జి ఎంపీపీగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగిన దివిటి రాజ్‌దాస్‌పైన మండల ఎంపీటీసీలు ఇటీవల అతని వైస్ ఎంపీపీ పదవిపై అవిశ్వాసం పెట్టగా, అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఈనెల 29న బుధవారం నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగగా ఈ ఎన్నికల్లో పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. దీంతో జిల్లా సీఈవో చందర్ నాయక్ నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీగా ఎన్నికైన టేకులపల్లి వినీతకు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పర్బన్న, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో మండల కేంద్రంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ఎట్టకేలకు మహిళా రిజర్వు ఎంపీపీ అధ్యక్ష పీఠంపై మహిళ

సుమారు నాలుగున్నరేళ్లకుపైగా ఎన్నో ఆటంకాలు, ఎంతో నిరీక్షణ అనంతరం జనరల్ మహిళలకు రిజర్వేషన్ అయిన నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పీఠాన్ని ఎట్టకేలకు మహిళా అభ్యర్థి టేకులపల్లి వినీత శుక్రవారం కైవసం చేసుకున్నారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్ష స్థానాన్ని జనరల్ మహిళకు రిజర్వు చేశారు. మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఐదు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ, రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ, మూడు స్థానాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి అప్పట్లో జరిగిన ఎన్నికల్లో పోచారం ఎంపీటీసీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన టేకులపల్లి వినీత అధ్యక్ష పదవికి పోటీ చేయగా, ఆమె ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ధర్మారెడ్డి, ఎంపీటీసీగా గెలిచిన కృష్ణవేణి కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా అధ్యక్ష పదవి కోసం పోటీ చేశారు. దీంతో టేకులపల్లి వినీతకు, కృష్ణవేణికి ఇద్దరికి సరి సమానంగా ఐదు ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు టాస్ పద్ధతిని పాటించారు. టాస్‌లో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి కృష్ణవేణికి అదృష్టం వరించింది. ఆమె టాస్‌లో విజయం సాధించి మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. అయితే కృష్ణవేణి పార్టీ విప్‌ను ధిక్కరించిందంటూ కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై ఎన్నికల అధికారులు అనర్హత వేటు వేశారు. అనంతరం ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైస్ ఎంపీపీగా ఎన్నికైన దివిటి రాజ్‌దాస్‌ను మండల ప్రజాపరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షునిగా ఉన్నతాధికారులు బాధ్యతలను అప్పగించడంతో ఆయన సుమారు నాలుగున్నరేళ్లకుపైగా ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగారు. ఎన్నికల అనంతరం పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అప్పట్లో ఎంపీపీ పదవి కోసం కాంగ్రెస్ నుంచి పోటీ పడి టాస్ ద్వారా ఓటమి పాలైన ఆమెకు ప్రస్తుతం అదృష్టం వరించింది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వైస్ ఎంపీపీగా ఎన్నికైన ఆమె శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ఎట్టకేలకు ఎంపీపీ మహిళ రిజర్వు స్థానంలో మహిళకు న్యాయం జరిగినట్లయింది. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్ర అవతరణ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 31: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతీ ఒక్కరిని వేడుకల్లో భాగస్వామ్యులను చేయాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినందున ప్రత్యేకాధికారులు పతాకావిష్కరణ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా చూడాలన్నారు. ఒక్క కలెక్టరేట్ మినహా అంతటా ఉదయం 9 గంటలలోపు పతాకావిష్కరణ జరగాలన్నారు. కామారెడ్డి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ వద్ద ఉదయం 8.30 గంటలకు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం సరిగ్గా 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ గావిస్తారన్నారు. అవార్డుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవని స్పష్టం చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున అగ్ని ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రంగనాథరావు, డీఎస్‌పీ యాకుబ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, జిల్లా అధికారులు దయానంద్, వరదారెడ్డి, భాగ్యలక్ష్మీ, కోటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల పురోగతిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం పరిశీలించారు. పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాల ఆవరణ సువిశాలంగా ఉన్నందున రాబోయే మూడు నాలుగు రోజులలో యువత భాగస్వామ్యంతో శ్రమదానం, మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంపీడీఓ నాగవర్ధన్, ఎంపీఓ మలహరి, ఎంఈవో ఎల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు

భిక్కనూరు: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలోని విత్తన పంపిణీ కేంద్రాలు, ఫెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన పంపిణీ కేంద్రాల్లో పర్మిట్ సమస్యలు, బిల్ జనరేషన్, ఫెస్టిసైడ్స్ దుకాణాల్లో పత్తి, వరి విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ విధనాన్ని, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. అనంతనం కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం పంటకు సంబంధించి అవసరమైన జీలుగ విత్తనాలు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా ఆయా మండలాలకు జీలుగ విత్తనాలను కేటాయించడం జరుగుతుందన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదన్నారు. జీలుగ విత్తనాల విషయంలో రైతులు ఆందోళన చెందవలిసిన అవసరం లేదన్నారు. నకిలీ విత్తనాల పట్ల వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, రైతులు సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ, మండల వ్యవసాధికారిణి రాధ, విండో చైర్మన్ భూమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెర్కిట్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆర్మూర్‌రూరల్, మే31: ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎం ఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన జీసీడీవో సింగం అనిత, మంతెన రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఆదివాసీ నాయకపోడు సంఘం అధ్యక్షుడు బండారి బోజన్న, ఉద్యోగుల సేవ సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆ దివాసీ నాయకపోడు విద్యార్థిని విద్యార్థులకు చదువు విషయంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలిచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు గాండ్ల రాంచందర్, గడ్డం శంకర్, లోలం గంగాధర్, శానం ప వన్, దాత్రిక అంజయ్య, మూడ అశోక్, పోసడుగు రవి, నవీన్, అయిలాపూర్ రాజు, గంట గంగాధర్, రాంప్రసాద్, సురేష్ రుక్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,మే31: బోదన్ పట్టణంలోని అనిల్ టాకీస్ చౌరస్తా వద్ద గల కెనాల్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని బోధన్ పట్టణ సీఐవీరయ్య తెలిపారు. మృతదేహన్ని జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతదేహనికి సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించలేదన్నారు. మృతదేహన్ని జిల్లాఆసుపత్రిలో భద్రపర్చామన్నారు.

అర్గుల్‌లో రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ

జక్రాన్‌పల్లి, మే31: మండలంలోని అర్గుల్ గ్రామంలో సింగిల్‌విండో కార్యా లయంలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. అంతకు ముందు వ్యవసాయాధికారిణి దేవిక జీలుగ విత్తనాల పం పిణీ తీరును పరిశీలించారు. అర్గుల్ సింగిల్‌విండో పరిధిలోని వివిధ గ్రామాల రైతులకు ఒక బస్తా రూ.1116లకు విక్రయించాలని తెలిపారు.

పొగాకు వాడకంతో ఆరోగ్య సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రమోదిత

రెంజల్,మే31: సిగరేట్, పొగాకు, గుట్కా ఉత్పత్తుల ద్వారా తయారయ్యే వాటిని తాగడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయని ముఖ్యంగా వీటి ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, చర్మ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పొగాకు ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ప్రమోదిత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని కూనేపల్లి, వీరన్న గుట్ట గ్రామాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయని వీటికి దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పొగాకు ఉత్పత్తులు ఇకనైనా మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీరణ అధికారి కరిపె రవీందర్, పంచాయతీ కార్యదర్శులు రాజు, కృష్ణ, వెంకట రమణ, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● పొగాకుపై అవగాహన

డొంకేశ్వర్: అతిప్రమాదకరమైన పోగాకు గుట్కా అలవాటు పడి క్యాన్సర్ బారిన పడవద్దని సూపర్‌వైజర్ సురేందర్ అన్నారు. గురువారం డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పై కలిగే అన ర్థాలపై వివరించారు. క్యాన్సర్ వ్యాధి అతి ప్రమాదకరమైందని అన్నారు. పోగాకు శరీర అవయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంపాసియ, క్రానిక్, అబ్జెక్టివ్ లాంటి ప్రమాదకరమైన వ్యా. దులు సోకుతాయని అన్నారు.ఎంఎల్ హెచ్‌పీ అమూల్యసతీష్,ఎల్‌టీ.దిలిప్,తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా నేను నా జీవితంలో ఏ రకమైన పొగాకు ఉత్పత్తులను ఉపయోగించనని, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులను పొగాకు ఉత్పత్తులను ఉపయోగించకూడదని ప్రేరేపిస్తానని ప్రతిజ్ఞ చేశారు. పొగాకు ఉత్పత్తుల వాడకుండా పర్యావరణ రక్షణకు నా వంతు సహకరిస్తానని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సు రాజీ, సూపర్‌వైజర్ కిషన్, సిబ్బంది ఉన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రుద్రూరు, మే 31: చిక్కడ్‌పల్లి ఊర చెరువులో అక్రమంగా మ ట్టిని తరలి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిక్కడ్‌పల్లి గ్రామ స్తులు శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజే శారు. గురువారం మధ్యాహ్నం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకుని తహసీల్దార్‌కు సమా చారం అందించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు. అదే రోజు మళ్ళీ నిర్లక్ష్యంగా కొందరు రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ వినతిపత్రం అంద జేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని చిక్కడ్‌పల్లి గ్రామస్తులు తహసీల్దార్‌ను కోరా రు. దీనిపై తహసీల్దార్ మాటా్లడుతూ ఎవరైనా అనుమతులు లే కుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సంతకాలు లేకుండానే రూ.8.80లక్షల చెల్లింపులు!

- ఇష్టారాజ్యంగా ఉపాధిహామీ పనులు
- ఉపాధిహామీ పనులపై అధికారుల పర్యవేక్షణ కరువు

తాడ్వాయి, మే 31: తాడ్వాయి మండలంలో ఉపాధి హామీ పనులు పూర్తిగా నిర్లక్ష్యంగా నిర్వహిచినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పర్యవేక్షణలో ఎన్నో చేదు నిజాలు బయటపడ్డాయి. ఉపాధిహామీ పనులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా నిర్వహించినట్లు తేట తెల్లమైంది. మండలంలోని చిట్యాల గ్రామంలో ఎంపీడీవో, ఏపీవో సంతకాలు లేకుండానే రూ.8.8లక్షలు బిల్లులు చెల్లించినట్లు వెల్లడైంది. సదరు బాధ్యతాయుతమైన అధికారులు సంతకాలు లేకుండా ఎలా బిల్లులు చెల్లిస్తారని ఆడిషనల్ డీఆర్‌డీఏ అధికారి వామన్‌రావు ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, ఏపీవో శృతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మండలంలో మీరు ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్నారా లేదా నామమాత్రంగా విధులకు వచ్చి వెళ్తున్నారా అంటూ ఏపీవో శృతిపై వామన్‌రావు మండిపడ్డారు. ఇంత నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నందివాడ ఫీల్డ్ అసిస్టెంట్ పెదోళ్ల లింగం సామాజిక తనిఖీ కోసం వచ్చిన అధికారులపై 60 మందితో దాడి చేయడానికి ప్రయత్నించినట్లు సామాజిక తనిఖీ అధికారులు ప్రజావేదికలో వెల్లడించారు. గ్రామంలో జరిగిన ఫార్మేషన్ రోడ్డు విషయంలో కొలతల్లో చాలా తేడాలున్నాయని సామాజిక తనిఖీ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చడం కోసం సదరు ఫీల్డ్ అసిస్టెంట్ తమపై దాడికి యత్నించినట్లు తెలిపారు. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని వామన్‌రావు తెలిపారు. నందివాడలో మస్టర్ గాలికి ఎగిరిపోయిందని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారని అధికారులు వెల్లడించారు. మస్టర్ గాలికి ఎగిరిపోవడంతో తమ ఇష్టానుసారంగా మస్టర్ తయారు చేసి బిల్లులు చెల్లించారని వివరించారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్ సంతకాలు లేకుండానే రూ.1.17లక్షల చెల్లింపులు జరిపారని వివరించారు. చిట్యాలలో 16 రోజుల పనికిగాను సదరు కూలీలు హాజరుకాకుండానే డబ్బులు పంపిణీ చేసినట్లు తెలిపారు. నర్సరీకి సంబంధించిన వివరాలు వెల్లడించే రిజిస్టర్‌ను ఇవ్వమంటే సదరు చిట్యాల కార్యదర్శి స్రవంతి రిజిస్టర్‌ను ఇవ్వలేదని సామాజిక తనిఖీ అధికారులకు వివరించారు. దీంతో సామాజిక తనిఖీ అధికారి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి రిజిస్టర్ ఎందుకు ఇవ్వలేదని అన్నారు. నందివాడ, దేవాయిపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందికి మస్టర్‌లలో హాజరు వేసి అక్రమంగా డబ్బులు పంపిణీ చేశారని వెల్లడించారు. గ్రామాల్లోని ఆశ వర్కర్లకు, మస్టర్‌లలో హాజరు వేసి డబ్బులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. చిట్యాలలో జరిగిన పనికి ఎలాంటి ఎంబీ రికార్డు లేకుండానే రూ.67వేలు చెల్లింపు అయినట్లు అధికారులు తేల్చారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌డీఏ వామన్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో చాలా అక్రమాలు జరిగాయని వెల్లడయిందన్నారు. అధికారులు ఎంపీడీవో, ఏపీవో శృతి, టెక్నికల్ అసిస్టెంట్‌లు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వెల్లడించారు. డబ్బులు పక్కదారి పట్టిన విషయంలో శాఖాపరమైన చర్యలకు పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజీద్‌అలీ, ఎస్‌ఆర్‌పీ కవిత, సామాజిక తనిఖీ విజిలెన్స్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న అధికారి వామన్‌రావు

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సదాశివనగర్, మే 31: విత్తనాల కొనుగోలుపై రైతులు అనేక జాగ్రత్తలు పాటిస్తు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాశాఖాధికారి ప్రజాపతి అన్నారు. మండలంలోని యాచారం, పద్మాజీవాడి, తిరుమన్‌పల్లి, దర్మారావుపేట, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాలలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో రైతులకు కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన విత్తనంతో పాటు గడువు తేది సీల్‌చేసి ఉన్న బస్తాలు జాగ్రత్తగా చూసి కొనుగోలు చేయాలన్నారు. ప్రతి కొనుగోలుపై రైతులు కొనుగోలు దారుల వద్ద అడిగి రసీదు పొందాలని రసీదుపైన అన్ని వివరాలు రాయించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. నకిలి విత్తనాలు అరికట్టడానికి ఇలాంటి విషయాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శిరీష, కవిత, శ్రీనివాస్ నాయక్, హారిక, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: విత్తనాలు కొనే ముందు రైతులు లైసెన్స్ ఉన్న దుకాణం దారుల వద్దనే కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డి పేట్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్ ఉన్న డీలర్ ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ప్రైవేట్ కం పెనీ వాళ్ల గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు అమ్మితే తీసుకోకూడదని, రైతు లు విత్తనాలు కొన్నప్పుడు తప్పకుండా రసీదు తీసుకోవాలని విత్తనాలు కొనే ముందు వ్యవసాయ అధికారి కాని శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దోమకొండ: విత్తనాల కొనుగోలు పట్ల శుక్రవారం మండలంలోని సీతారాంపూర్‌లో గ్రామంలో ఏఈవో శ్రీలత రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన గ్రామాల్లో ఇష్టానుసారంగా విత్తనాల విక్రయాలు అనే వార్తకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏఈవో రైతులనుద్దేశించి మాట్లాడుతూ లైసెన్స్‌డ్ షాపుడీలర్ వద్ద మాత్రమే విత్తనాలను, పురుగు మందులను కొనగోలు చేయాలని సూచించారు. లూజుగా వున్న బస్తాలలో విత్తనాలను కొనుగోలు చేయవద్దని, విత్తనాలను కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పకుండా తీసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన సమయంలో బస్తాపై గడువు తేదీ, రకంపేరు లాట్ నంబర్‌లను గమనించాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైన ప్రవైటు విత్తనాల కంపనీల వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని వారి వద్ద ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ

- షెట్టర్‌లను తొలగించాలని ఒక వర్గం డిమాండ్
- తొలగించనివ్వమని మరో వర్గం

బీర్కూర్, మే 31 : బీర్కూర్ మండల కేంద్రంలో నాలుగు పలకల రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా 43 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరించాలని నిర్ణయించారు. ఇరువైపులా డ్రైనేజీలు, మధ్యసెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. గత కొన్ని రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా 43 ఫీట్ల వరకు ఉన్న ఇళ్లను షెట్టర్‌లను కూలగొట్టారు. అనంతరం ఇరు వైపులా డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ఒక సామాజిక వర్గానికి చెందిన షెట్టర్‌ల ముందు భాగాన్ని తొలగించకుండా డ్రైనేజీ వంకరగా తిప్పి కడుతుండటంతో గ్రామస్తులు పనులకు అడ్డుకున్నారు. మా షెట్టర్‌లను, ఇళ్లను తొలగించి వారి షెట్టర్‌లను ఎందుకు తొలగించడం లేదని గుత్తేదారును నిలదీశారు. మాషెట్టర్‌లను తొలగించినట్లే వారి షెట్టర్‌లను తొలగించే వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఇరు వర్గాల మధ్య గొడవ చెలరేగింది. వందలాది మంది ఘటన స్థలానికి చేరుకున్నారు. షెట్టర్‌లను తొలగించాలని ఒక వర్గం డిమాండ్ చేయగా, తొలగించనివ్వమని మరో వర్గం తేల్చి చెప్పింది. దీంతో ఇరు వర్గాల మధ్య చాలా సేపు వాదోపవాదాలు జరిగాయి. షెట్టర్‌లను తొలగించిన తరువాతనే పనులు చేపట్టాలని అప్పటి వరకు నిలిపివేయాలని గ్రామస్తులు గుత్తేదారును హెచ్చరించారు. అందరికీ ఒకే న్యాయం ఉండాలని, ఒకరికి ఒకలా, మరొకరికి మరోలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. దీంతో డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి.


బీర్కూర్‌లో రోడ్డు పనుల వద్ద గొడవ పడుతున్న దృశ్యం

పారిశుధ్యం, తాగునీటిపై జిల్లా అధికారి సమీక్ష

మద్నూర్, మే 31: ఉమ్మడి మద్నూర్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి మినీలో వచ్చిన పడకేసిన ప్రత్యేక పాలన కథనానికి జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ స్పందించి శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీలో గ్రామ కార్యదర్శితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు రోగాల బారిన పడకుండా చూడటానికి గాను చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యంపై అంతంత మాత్రంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు తమ గ్రామ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్పంచ్‌ల పాలన ముగిసిన తరువాత ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిన కూడా పారిశుధ్యంపై నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆయా గ్రామ పంచాయితీల కార్యదర్శులతో తమతమ గ్రామ పంచాయితీల పరిధిలో పారిశుధ్యం పనులు తాగునీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఇక నుంచి కార్యదర్శులు అలర్ట్‌గా ఉండి రాబోయే వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయనతో పాటు డీఎల్‌పీవో నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కాలభైరవ స్వామి ఆలయంలో
బహులాష్టమి హోమం

రామారెడ్డి, మే 31: రామారెడ్డి మండల కేంద్రం- ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన శ్రీకాలభైరవస్వామి ఆలయంలో బహులష్టమి హోమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రంగుప్తా నేతృత్వంలో పండితులు శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 35 జంటలు హోమం చేపట్టి ఆలయ గర్భగుడిలో పాలాభిషేకం, సింధూరపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, సతీష్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా, మనిష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ ఎరువులను విక్రయిస్తున్న దృశ్యం

డంపింగ్ యార్డులో
సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టాలి

భిక్కనూరు, మే 31: అన్ని గ్రామాల్లోని డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో డంపింగ్‌యార్డులు, అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో బాగంగా పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంతంపల్లిలో డంపింగ్‌యార్డులో తయారు చేసిన సేంద్రియ ఎరువును తయారు చేసి విక్రయించడం పట్ల గ్రామపంచాయితీ సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న పనులను నాణ్యతతో త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ సోహెల్, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్పీ

పోలీస్‌స్టేషన్‌ను
పరిశీలించిన ట్రైనీ ఎస్పీ

బిచ్కుంద, మే 31: బిచ్కుంద పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ట్రైని ఎస్పీ కాజల్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్

మహిళా సంఘాలకు
ఆర్థిక వనరులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సదాశివనగర్, మే 31: మహిళా సంఘాలకు ఆర్థిక వనరులు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఎంచుకుందని డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల కుట్టుమిషన్ల పరిశ్రమను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల డ్వాక్రా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో పాఠశాలల ఏకరూప దుస్తులను తయారుచేయడానికి డ్వాక్రా సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే కుట్టుమిషన్లు అందజేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకుని సంఘాల అభివృద్ధితో పాటు ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి, సీసీలు గొర్రె రాములు, అంజనేయులు, లింగం, కృష్ణాంజలి, నరేందర్‌రెడ్డి,మహిళ సంఘం అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

పొగాకు ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించాలి

కామారెడ్డి టౌన్, మే 31: కామారెడ్డి పట్టణంలోని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రపంచ వ్యతిరేక దినోత్సవ ర్యాలీని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటివల ప్రభుత్వం పొగాకు ఉత్పత్తుల నిషేధం, పాన్‌గుట్కా అమ్మకాల నిషేధించిన నేపథ్యంలో పోలీస్‌శాఖ వారితో కలిసి పని చేయాలని సూచించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ప్రజల్లో మరింత పొగాకు ఉత్పత్తుల నిషేదంపై అవగాహన చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి శోభారాణి, మెడికల్ ఆఫీసర్ సాయి ఈశ్వరి, చందనప్రియ, సూపర్‌వైజర్ రమణ, సోషల్‌వర్కర్ రాహుల్, సుభాషిణి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.


వనితతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్‌డీవో రంగనాథ్

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా వనిత ఎన్నిక

కామారెడ్డి టౌన్, మే 31: కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉరుదొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 15న వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఖాళీ అయిన వైస్‌చైర్‌పర్సన్ పోస్టుకు ఎన్నికల కమీషన్ షెడ్యుల్ ఖరారుచేసింది.దీంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆథరైజ్డ్ అధికారిగా ఆర్‌డీఓ రంగనాథ్‌ను నియమించి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియను చేపట్టారు. మొత్తం 49 మంది కౌన్సిలర్‌లకు గాను 26 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా 30 మంది కౌన్సిలర్‌లు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి 10వ వార్డుకు చెందిన ఉరుదొండ వనిత పేరు రావడంతో పాటు ఇతరులు ఎవరు పోటిలో లేకపోవడంతో వనిత ఏకగ్రీవంగా ఎన్నికైందని ఆర్‌డీఓ ప్రకటించి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల రిపేరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, మే 31: బ్యాటరీ ట్రైసైకిళ్ల రిపేరింగ్‌పై శిక్షణ ఇచ్చుటకు మెకానిక్ రిపేరింగ్‌లో అనుభవం గల దివ్యాంగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ బావయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఇద్దరు దివ్యాంగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వికలాంగుల ఆర్థిక పునరావాస పథకం కింద ఋణం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు జూన్ 3న సాయంత్రంలో కలెక్టరేట్‌లోని 31 గదిలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

7న జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి టౌన్, మే 31: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని జూన్ 7న 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో జడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జడ్పీసీఈవో చందర్‌నాయక్ తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేరితిలో అధికారులు సమగ్ర వివరాలతో సమావేశానికి రావాలని తెలిపారు.


భైరాపూర్‌లో క్లాత్ కటింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జూన్ 12లోపు యూనిఫాంలు అందించాలి

బీర్కూర్, మే 31: జూన్ 12 లోపు విద్యార్థులకు ఏక రూప దుస్తులు అందించాలని ఇంచార్జి ఎంపీడీవో భానుప్రకాష్ వర్కర్లకు సూచించారు. శుక్రవారం ఆయన బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామానికి విచ్చేశారు. గ్రామంలో విద్యార్థుల యూనిఫాంల కుట్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్ మండలంలో 2 వేల 256 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. విద్యార్థులకు యూనిఫాంలను అందించేందుకు ప్రభుత్వం యూనిఫాం బట్టలను సరఫరా చేసిందన్నారు. ఈ మేరకు యూనిఫాంలు కుట్టడానికి భైరాపూర్‌లో మహిళా సంఘానికి బాధ్యత అప్పగించామన్నారు. ప్రస్తుతం భైరాపూర్‌లో క్లాత్ కట్టింగ్ సెంటర్‌ను పరిశీలించామన్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, అంతలోపు దుస్తులు అందించాలని సూచించామని అన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, మే 31: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించిన నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

రామారెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిపై కేసు నమోదు

రామారెడ్డి, మే 31: రామారెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు రామారెడ్డి ఎస్‌ఐ కొండ విజయ్ తెలిపారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ఓ మహిళతో గురువారం సాయంత్రం అసభ్యంగా ప్రవర్తించగా ఆమె ప్రతిస్పందించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. దీంతో ఆమె బంధువులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఆనంద్‌పై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి, మే 31: ఎల్లారెడ్డి పట్టణంలోని 11వ వార్డు లింగారెడ్డిపేట్‌కి చెందిన మధునాలా మల్లయ్య గత మూడు రోజుల క్రితం పక్షవాతం రావడంతో కాళ్లు, చేతులు పని చేయడం లేదు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లకుండా ఇంట్లోనే చెట్ల మందులు వాడుతున్నారు. అది తెలిసిన కౌన్సిలర్ భూంగారి రాము పల్లె దవాఖాన డాక్టర్ శివతో కలిసి కుటుంబ సభ్యులకు ఆసుపత్రికి వెళ్లాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించి ఆలన అంబులెన్స్‌ను పిలిపించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆలన సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు.

సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావ్

పిట్లం, మే 31: గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ట్రాక్టర్‌ల ద్వారా సేకరించిన చెత్త చెదారం, వ్యర్థ పదార్థాలు డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని, ఎక్కడ పడితె అక్కడ వెయరాదని గ్రామ పంచాయతీ కార్యదర్శికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావ్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా డిపిఓ పిట్లంలోని డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లలో తప్పని సరిగా పోడి చెత్త, తడి చెత్తను వెరుగా వెయాలని అధికారులకు ఆదెశించామన్నారు. తప్పని సరిగా సేంద్రియ ఎరువులు తయారు చేయడం, పలు అంశాలపై సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఆయన వెంట కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

పిట్లం. మే 31 తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది పని తీరు, ఆయా అంశాలను తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు దాన్యం ఎంత వరకు తరలించామని, ఇంక ఎన్ని రోజులలో పూర్తి అవుతుందని వివరాలు సేకరించారు.అధికారులు ప్రతి రోజు సమయ పాలన పాటించాలని తెలిపారు.విదుల పట్ల నిర్లక్షం వహిస్తె చర్యలు తప్పవని సిబ్బందికి ఆదెశించారు.

'బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దు'

కామారెడ్డి టౌన్, మే 31: బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నందున ఎన్నికల మెనిఫేస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కులగణన చేపట్టాలన్నారు. బీసీ కులగణన చేపట్టిన తర్వాతే గ్రామపంచాయతిలో సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు, మున్సిపల్ కౌన్సిలర్‌ల ఎన్నికల నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కోరుతున్నామన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34శాతం రిజర్వేషన్‌లు ఉండేవని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 18శాతానికి తగ్గించిందని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వమైన బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210